
మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజర్షిషా

నాగోబా జాతరను విజయవంతం చేద్దాం

● సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతరను విజయవంతం చేద్దామని అధికారులకు జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ మలవియాలతో కలిసి ఐటీడీఏ పరిధిలోని అధికారులతో పాటు ఆయా శాఖల జిల్లాస్థాయి అధికారులతో జాతర ఏర్పాట్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా ఏర్పాట్లు, అభివృద్ధి క్యాక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. ఈనెల 28న రాత్రి మెస్రం వంశీయులు నిర్వహించే మహాపూజలతో ప్రారంభమై జాతర ఉత్సవాలు ఫిబ్రవరి 4వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. మర్రిచెట్లతోపాటు గోవాడ్ ప్రాంతంలో మరుగుదొడ్లతో పాటు, స్నానపు సౌకర్యాలు కల్పించి, నీటి సరఫరా చేయాలని సూచించారు. జాతర ఏర్పాట్లను ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్ పనులపై దృష్టి పెట్టాలి. గతంలో కంటే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. గతంలో వచ్చిన ఇబ్బందులను ఈసారి అధిగమించేలా ప్రయత్నించాలన్నారు. తాగునీటి, పారిశుద్యం, ఇతర సౌకర్యాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. సామాన్య భక్తుల క్యూలైన్లు, బారికేడ్లు ఏరాటుపై ప్రత్యేకదృష్టి పెట్టాలి. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు, పార్కింగ్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పోలీసు ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సీసీ కెమెరాలతో జాతరను పర్యవేక్షించాలని సూచించారు. శాఖల వారీగా ఇచ్చిన ఏర్పాట్ల పనులు ఈనెల 28న జాతర ప్రారంభం లోగా పనులు పూర్తి అయ్యేలా అధికారులు పని చేయాలని ఆదేశించారు.

● భక్తులకు సౌకర్యాలు కల్పించాలి : ఎమ్మెల్యే బొజ్జు

ఇంద్రవెల్లి: నాగోబా జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలను కల్పించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. జాతర సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే భక్తులకు కల్పించే సౌకర్యాలపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివస్తారని అందుకు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశించారు. నాగోబా ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని తెలిపారు. జాతరలో తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, జాతరకు వచ్చే భక్తులకు బస్సులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భక్తులు భద్రతకు సంబంధించి బందోబస్తు, బెల్ట్ షాపుల మూసివేతకు ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు పటేల్, మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖడే ఉత్తం, నాగోబా ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్‌రావు, బీఈడీ కళా శాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఆలయ ఈవో రాజమౌళి, తదితరులు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు భూమిపూజ

నేరడిగొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడూర్ గ్రామంలో రూ.51 లక్షలతో అభివృద్ధి పనులకు శుక్రవారం శంకుస్థాపన, షాదీఖాన నిర్మాణానికి రూ.ఐదు లక్షలు, కబరస్తాన్ కాంపౌండ్ వాల, సీసీ నిర్మాణానికి రూ. ఐదు లక్షలు, సవారి షెడ్డు నిర్మాణానికి రూ. మూడు లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 15 లక్షలు, సాయిబాబా షెడ్డు నిర్మాణానికి రూ. 15 లక్షలు, భవాని తాండ గ్రామంలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. మూడు లక్షలు, అమృత్ తండాలో సీసీ రోడ్లకు రూ. మూడు లక్షలు, హైమాస్ లైట్ల నిర్మాణానికి శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వడూర్ గ్రామ అభివృద్ధి నా బాధ్యత అని విడతల వారీగా అన్ని సౌకర్యాలు కల్పించుకుందామని మొత్తం 51 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నేరడిగొండ వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, వడూర్ మాజీ ఉప సర్పంచ్ ఫయాజ్, ఎంపీటీసీలు పండరీ, శ్రీనివాస్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, అనిల్ అన్న యువ సైన్యం అధ్యక్షుడు దేవేందర్ రెడ్డితో పాటు బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



లెక్క తేలింది!

» జిల్లాలో సాగుకు యోగ్యం కాని భూములు 2,100 ఎకరాలు » సబ్ డివిజన్ ఆప్షన్ లేక వివరాల నమోదుకు ఇబ్బందులు » దాబా హోటళ్లు, వెంచర్ భూములకు రైతుబంధు సొమ్ము » ఇక రైతు భరోసా పథకం కింద ఎకరాన రూ.12 వేలు » ఈనెల 26 నుంచి రైతు భరోసా పథకం అమలుకు సర్వంసిద్ధం

ఆదిలాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాగుకు యోగ్యంకాని భూముల లెక్క తేలింది. దీంతో రైతుభరోసా పథకం అమలుకు అడ్డం కులు తొలగాయి. ఈ నెల 26 నుంచి రైతుభరోసా పథకాన్ని అమలు చేసేందుకు అధికారులు సర్వంసిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాం లో చేపట్టిన రైతుబంధు పథకం అమలు తీరుపై తీవ్ర విమర్శలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి సర్వేను చేపట్టి సాగుకు యోగ్యంకాని భూముల వివరాలను తేల్చింది. జిల్లాలో 1027 మంది రైతులకు సంబంధించిన 2,100 ఎకరాలు భూములు పంటల సాగుకు అనుకూలం గా లేవని అధికారులు గుర్తించారు. భూముల వివరాలను ప్రత్యేక పోర్టల్ లో నమోదు చేశారు. జిల్లాలో 102 క్లస్టర్ల పరిధిలో 5రోజుల పాటు రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారుల బృందాలు ప్రత్యేకంగా సర్వేను చేపట్టారు. మొత్తం లక్షా 62 వేల పట్టాదార్ పాసుపుస్తకాలు ఉన్నాయి. వీటి ఆధారంగా సర్వేను చేపట్టి సాగుకు యోగ్యంకాని భూముల వివరాలను సేకరించారు. జిల్లాలో రెవెన్యూ పట్టాలు లక్షా 46వేల 757 కాగా ఆర్‌వో ఎఫ్ పట్టాలు 25వేల 316 ఉన్నాయి. చివరిసారిగా రబీలో లక్షా 58వేల 683 మంది రైతులు 5లక్షల 58వేల 280 ఎకరాలకు గాను రూ.277.64 కోట్లు పెట్టుబడి సహాయంగా రైతుల ఖాతాల్లో జమ చేశారు. ఇకపై రైతుభరోసా పథకం కింద సాగుకు యోగ్యంకాని భూములను తొలగించనున్నారు. పంటలు పండిన పండక పోయిన సాగుకు అనుకూలమైన భూములకు మాత్రమే రైతుభరోసా కింద పెట్టుబడి సహాయాన్ని అందించనున్నారు.

గుర్తించినా.. తొలగించలే..

క్షేత్రస్థాయిలో సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించిన కొన్నింటిని అధికారులు తొలగించ లేదని తెలుస్తుంది. రైతుభరోసా పోర్టల్‌లో సబ్ డివిజన్ లేకపోవడంతో సాగుకు యోగ్యం కాని భూ విస్తీర్ణాన్ని వదిలేసినట్లు చెబుతున్నారు. ఉదాహరణకు ఒకరైతు పేరిటా 3ఎకరాల భూపట్టా ఉంటే.. ఇందులో నుంచి ఎకరం భూమిని విక్రయించి లేఔట్‌ను ఏర్పాటు చేశారు. మిగితా రెండు ఎకరాలు వృథాగానే మిగిలిపోయింది. ఇందులో అడపాదడప పంటలను సాగు చేయడంతో తొలగించేందుకు అవకాశం లేకుండా పోయింది. ఎందుకంటే ప్రత్యేక పోర్టల్‌లో సబ్‌డివిజన్ ఆప్షన్ లేకపోవడంతో ఎంత మేరకు తొలగించాలనే దానిపై స్పష్టత కనిపించడం లేదంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మూడు ఎకరాల భూమి సాగుకు అనుకూలమనే చూపాల్సి వస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇలా చాలా గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించిన పూర్తిస్థాయిలో తొలగించేందుకు సాధ్యపడడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

సర్వేతో బయటపడ్డ అక్రమాలు

గత ప్రభుత్వం రైతుబంధు పథకం కింద పంటలను సాగు చేసిన రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించింది. ఎకరాన ఏడాదికి రూ.10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేసింది. ఇవి ఏమూలాన సరిపోవడం లేదంటూ కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పేరిట ఎకరాన ఏడాదికి రూ.12వేలు చెల్లించాలని నిర్ణయించింది. దీనికి గాను క్షేత్రస్థాయిలో సాగుకు యోగ్యం కాని భూములను సర్వే చేపట్టడంతో అక్రమాలు బయట పడ్డాయి. గతంలో ప్రభుత్వం భూసేకరణ చేపట్టిన భూములతో పాటు గుట్టలు, మైనింగ్ భూములు, లేఔట్ వెంచర్లు, దాబాహోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, కాలనీలకు రైతుబంధు సొమ్ము అందింది. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తడంతో సాగుకు యోగ్యంకాని భూములను తొలగించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక సర్వేను చేపట్టారు. గతంలో

(తరువాయి 6వ పేజీలో...)


ఇచ్చోడ మండలంలో సాగుకు యోగ్యంకాని భూమిని గుర్తిస్తున్న అధికారులు

పక్కన ఫొటోలో కనిపిస్తున్న వెంచర్ భూమి ఇచ్చోడ మండలం కోకస్‌మన్నూర్ గ్రామ శివారులోనిది. సర్వే నెం. 86/ఈ/1లో 1.13 గుంటల భూమికి గతంలో రైతుబంధు కింద పెట్టుబడి సహాయం అందింది. ఇటీవల అధికారులు సర్వే చేపట్టి ఈ సర్వే నెం.లో గల భూమి సాగుకు యోగ్యం కాదని గుర్తించారు. ఈ భూమిని గతంలోనే లేఔట్ చేసి ప్లాట్ల ను విక్రయించడం జరిగిందని వ్యవసాయ శాఖాధికారులు పేర్కొంటున్నా రు. ఇకపై ఈ లేఔట్ భూమికి రైతుభరోసా కింద పెట్టుబడి సహాయాన్ని నిలిపి వేస్తున్నట్లు అధికారులు గ్రామసభలో వెల్లడించారు.

పక్కన ఫొటోలో కనిపిస్తున్న దాబాహోటల్ గుడిహత్నూర్ మండలంలోని కమలాపూర్ శివారు ప్రాంతంలోనిది. సర్వే నెం. 14లో 1.20 విస్తీర్ణంలో ఈ దాబాహోటల్‌ను నిర్మించారు. గతంలో రైతుబంధు కింద దీనికి పెట్టుబడి సహాయం అందింది. ప్రస్తుతం ప్రభుత్వం సాగుకు యోగ్యంకాని భూములను సర్వే చేయడంతో ఈ దాబాహోటల్ నిర్మించిన భూమి సాగు కు యోగ్యం కాదని గుర్తించారు. దీనిని రైతుభరోసా కింద పెట్టుబడి సహాయాన్ని నిలిపి వేస్తున్నట్లు గ్రామసభలో ప్రకటించారు.



గుడిహత్నూర్ మండలంలో సాగుకు యోగ్యంకాదని అధికారులు గుర్తించిన దాబా హోటల్ ఇదే..


సభ్యులతో మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

అధ్యయన కమిటీకి స్వాగతం పలికిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రైతు ఆత్మహత్యలపై బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ ఉమ్మడి జిల్లాలో శుక్రవారం పర్యటిస్తోంది. ఇందులో భాగంగా నేరడిగొండలోని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు రాజకీయ అంశాలపై సభ్యులతో కలిసి ఎమ్మెల్యే చర్చించారు. మాజీ మంత్రులు జోగు రామన్న, అజయ్‌కుమార్, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాథోడ్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.


పిల్లల చేతుల మీదుగా పార్కును ప్రారంభిస్తున్న ఎస్పీ

పార్కు ఏర్పాటు అభినందనీయం : ఎస్పీ

ఇంద్రవెల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పార్కు ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పిల్లల పార్కును శుక్రవారం ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌తో కలిసి పిల్లల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పార్కు పిల్లలకు ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. పెద్దలు పార్కులో వాకింగ్ చేసే వీలుందని, పిల్లలు బయటకు వెళ్లకుండా పార్కులోనే ఆడుకునే అవకాశం ఉందన్నారు. ఇందులో ఉట్నూర్ సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

● రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ నిరంజన్ రెడ్డి ● బాధిత కుటుంబాలను పరామర్శించిన అధ్యయన కమిటీ సభ్యులు


రేణిగూడలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి


రామాయిలో మిర్చి పంటను పరిశీలిస్తున్న అధ్యయన కమిటీ సభ్యులు

ఆదిలాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి) రైతులు అధైర్యపడవద్దు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని రైతు ఆత్మహత్యల అధ్యయన కమిటీ చైర్మన్ మాజీ మంత్రి నీరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధ్యాయన కమిటీ తొలిరోజు ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని కిసాన్‌చౌక్‌లో అన్నదాత విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం క్షేత్ర స్థాయిలో అన్నదాతల స్థితిగతులు, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధి విధానాలు, రైతులపై వాటి ప్రభావం తదితర అంశాలను అధ్యయనం చేశారు. దీనిలో భాగంగా ఆత్మహత్యలు చేసుకున్న పలు రైతు కుటుంబాలను పరామర్శించి ధైర్యంచెప్పారు. అధ్యయన కమిటీలో మాజీ మంత్రులు జోగు రామన్న, సత్యవతి రాథోడ్, పువ్వాడ అజయ్, ఎమ్మెల్సీలు కోటిరెడ్డి యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజీరెడ్డి గోవర్దన్, రసమాయి బాలకిషన్, అంజయ్యయాదవ్, బోత్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ తదితరులున్నారు.ఈ సందర్భంగా అధ్యాయనకమిటీ చైర్మన్ నీరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యమాలతో సాధించుకున్న తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంలో రైతులు సుభిక్షంగా ఉండాలని గత ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తే బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రుణమాఫీ రైతుభరోసా విషయంలో ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని మండిపడ్డారు. రైతు ఆత్మహత్యలన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనన్నారు. దిక్కుతోచని స్థితిలోనే అన్నదాతలు అఘాయిత్యాలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వానికి మనసు రావడం లేదని రైతులు పిట్టల్లా రాలిపోతున్న స్పందించడం లేదని ధ్వజమెత్తారు. ప్రభుత్వ అనాలోచిత విధానాలతో విసిగెత్తిపోయిన రైతులకు ధైర్యాన్ని కల్పించనందుకే అధ్యాయన కమిటీ రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తుందని తెలిపారు. ప్రభుత్వ పెద్దలు ఢిల్లీ విదేశాలకు తిరిగే బదులు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోవాలన్నారు. అనంతరం మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ అన్నదాతల సంక్షేమంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ రైతులను రాజుగా చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుల్లో ముంచుతుందన్నారు. రైతులకు న్యాయంజరిగేంత వరకు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తునే ఉంటామని పేర్కొన్నారు. ఇటీవల బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన బేల మండలం రేణిగూడ గ్రామానికి చెందిన రైతుజాదవ్‌దేవురావు కుటుంబాన్ని అధ్యాయన కమిటీ సభ్యులు పరామర్శించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతునికి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆ తర్వాత బాధిత కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి జోగు రామన్న లక్ష ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని రామాయి గ్రామంలో పంట చేన్లను పరిశీలించారు. అలాగే యాపల్‌గూడలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రుణమాఫీ, రైతుభరోసా అమలు, సమస్యల పై పలువురు రైతులు వివరించారు. వారి వెంట మాజీ జడ్పీ చైర్మన్లు లోలం శ్యాంసుందర్, రాథోడ్‌జనార్ధన్, తుల‌శ్రీనివాస్, చారులత, రాంకిషన్‌రెడ్డి, డా.సుభాష్, రైతు సంఘం నేతలు తదితరులున్నారు.


● జిల్లా కేంద్రంలో కిసాన్‌చౌక్ వద్ద రైతు విగ్రహానికి పూలమాల వేసి నినాదాలు చేస్తున్న సభ్యులు


గ్రామం ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు

పాదరక్షలతో వస్తే రూ.5వేల జరిమానా

● పుష్యమాసం ఆదివాసీలకు పవిత్రం

ఇంద్రవెల్లి, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడ గ్రామంలో గ్రామస్థుల ఆధ్వర్యంలో పవిత్ర పుష్యమాసంలో పాదరక్షలు ధరించి తమ గ్రామానికి రావద్దని, పాదరక్షలు ధరించి గ్రామానికి చెందిన వాళ్లు గాని బయట గ్రామానికి చెందిన వాళ్లు గాని, వస్తే వారికి రూ.ఐదు వేల జరిమానా అనే చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. పుష్యమాసాన్ని ఆదివాసీలు పవిత్ర మాసంగా భావిస్తారు. పుష్యమాసం 31 రోజుల పాటు ఆదివాసీ గిరిజనులు భక్తిశ్రద్ధలతో జై జంగో, జై లింగో దీక్షలు నిర్వహిసూత మహాదేవుడిని కొలుస్తుంటారు. పవిత్ర పుష్య మాసంలో ఆదివాసీ గిరిజనులు తమ కుల దైవాలతో పాటు గ్రామ దేవతలకు పూజలు నిర్వహించడం ఆధునీకంగా వస్తున్న సంప్రదాయం. 31 రోజుల పాటు పాద రక్షలు లేకుండా జై జంగో, జై లింగో దీక్షలను పవిత్రంగా కొనసాగించడం వెనుక ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉంటారని నమ్మకం.


పులిమడుగు సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ జయవంతురావు చౌహాన్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

● విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ జేఆర్ చౌహాన్ ఆకస్మిక తనిఖీ

ఉట్నూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్, పులిమడుగులలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లను విద్యుత్ శాఖ చీఫ్ ఇంజనీర్ శుక్రవారం అకస్మీకంగా తనిఖీ చేశారు. సబ్‌స్టేషన్‌లలో ఏవైనా లోపాలు ఉంటే సంబంధించిన అధికారులకు వెంటనే తెలియజేయాలని, ప్రతీ రోజు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించాలని, సమస్యలు ఉంటే వెంటనే తెలపాలని, అవసరమైన మరమ్మత్తులు చేపట్టాలని వినియోగదారులకు నాణ్యమైన నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలన్నారు. లైన్‌లో సమస్యలు రాకుండా చెట్ల కొమ్మలు, లూస్ లైన్లు సరి చేసుకోవాలని, ప్రమదంగా డ్యామేజ్ ఉన్న పోల్స్, మార్చాలని, అధిక లోడ్‌లో ఉన్న ట్రాన్ఫర్ స్థానంలో మరో అదనపు ట్రాన్ఫర్మర్ ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫర్ కాలిపోకుండా చూడాలని ప్రతి వినియోగదారుడు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ వినియోగించుకోవాలన్నారు. విద్యుత్ చౌర్యంచేసే గృహ, వ్యవసాయానికి వాడేవారు క్రమబద్ధీకరణ చేసుకోవాలని తెలుపాలన్నారు. విద్యుత్‌చౌర్యం వాళ్ల ట్రాన్స్‌ఫార్మర్‌ల పైన అధిక లోడు పడడం వలన కాలిపోవడం జరుగుతుందన్నారు. సంస్థకు నష్టం వాటిల్లే అవకాశం రాకుండా విద్యుత్ చౌర్యం చేసేవారిని గుర్తించి, కేసులు నమోదు చేయాలని ప్రమాదాలు జరుగకుండా వినియోగదారులకు, సిబ్బందికి ప్రమదం జరుగకకుండా ముందస్తుగా స్థలాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలన్నారు. బిల్లులో ఇచ్చిన గడువులోపు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, వినియోగదారులకు బిల్లులలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత ఏఏఓ లేదా ఏఈ ఆఫీసులో లేదా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తులు ఇచ్చి సంప్రదించి సరి చేయించుకోవాలన్నారు. సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 27నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, 11 కేవీ ఫీడర్‌లో అధిక లోడులు ప్రతిరోజు వారీగా గుర్తించాలని, సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారు చేసి సిద్ధంగా ఉండాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి అధికారులు, సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంజనీర్లు సుభాష్, ప్రభాకర్, అసిస్టెంట్ ఇంజనీర్ పృథ్వి సబ్ ఇంజనీర్ శ్రవణ్, ఎల్ఐ లక్ష్మణ్, తదితర సిబ్బంది పాల్గొన్నారు.



మగ్గంను ప్రారంభిస్తున్న పద్మశాలీ సంఘం సత్రం నిర్వాహకులు

సరస్వతీ అమ్మవారికి మగ్గంపై ప్రత్యేక చీర

బాసర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి దేవస్థానంలో ఫిబ్రవరి 1వ తేది నుంచి మూడు రోజుల పాటు జరిగే వసంత పంచమి వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక చీరను మగ్గంపై తయారీని ప్రారంభించారు. ఆలయం వద్ద గల పద్మశాలి సత్రంలో మగ్గంపై అమ్మవారికి సమర్పించే చీరను పూజలు నిర్వహించి సత్రం అధ్యక్షులు రాపోలు సుధాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారికి పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గత రెండేళ్ల నుంచి పట్టు వస్త్రాలను తయారు చేసి సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సరస్వతి అమ్మవారితో పాటు మహాలక్ష్మీ, మహాంకాళి, వేద వ్యాస మహార్షికి వస్త్రాలను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సారి ముగ్గురు అమ్మవార్ల చీరెలను తయారు చేసి శోభాయాత్రతో అమ్మవారికి వసంత పంచమి రోజు సమర్పించే కార్యక్రమం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఇందులో కార్యనిర్వహణ అధ్యక్షురాలు జీ. రాజేశ్వరి, ఉపాధ్యక్షులు రమణ విశ్వం, కోమటి సత్యనారాయణ, కార్యదర్శి బోగ వెంకటరమణ, ధర్మ కర్తలు గెంటిల శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన

బోథ్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 1 వరకు మూడు రోజులపాటు కొట్టాల పోచమ్మ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని గ్రామస్థులు, పట్టణవాసులు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించి వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేంద్రప్రసాద్, మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు శివారెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, ఆలయ కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



రైల్వే జీఎం అరుణ్‌కుమార్‌తో చర్చిస్తున్న ఎంపీ నగేష్

రైల్వే జీఎంను కలిసిన ఎంపీ నగేష్

ఆదిలాబాద్ రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సౌత్ సెంట్రల్ రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్‌ను సికింద్రాబాద్‌లోని ఆయన కార్యాలయంలో ఆదిలాబాద్ ఎంపీ గొడం నగేష్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని రైల్వే అభివృద్ధి పనులతోపాటు రైల్వే స్టేషన్లను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. రైళ్ల సంఖ్యను పెంచాలని కోరారు. రైల్వే జీఎం సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

బాసర, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో శుక్రవారం పీయూసీ విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభమైంది. వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్ ల్యాబ్‌ను ప్రారంభించారు. డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు విద్యాభ్యాసంలో అవసరమైన విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు ల్యాబ్ ఏర్పాటుతో అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. విద్యార్థులకు అన్ని రకాల సాఫ్ట్‌వేర్‌లతో పాటు ఇంటర్నెట్ సౌకర్యంతో పాటు అత్యాధునిక కంప్యూటర్ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళి దర్శన్, ఏవో రణధీర్, డీన్ డా. విట్టల్, తదితరులు పాల్గొన్నారు.



పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న కంది మౌనారెడ్డి

బాబా బోధనలు అందరికీ ఆదర్శనీయం'

ఆదిలాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి. అలాగే బాజీరావుబాబా బోధనలు అందరికీ ఆదర్శనీయమని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి సతీమణి కంది మౌనారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం బేల మండలం సిర్సన్న గ్రామంలో జరిగిన బాజీరావుబాబా సప్తాహ వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే జైనథ్ మండలం అర్లి గ్రామంలో జరిగిన సప్తాహ వేడుకల్లో పాల్గొన్నారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గిమ్మసంతోష్, దేరీకృష్ణారెడ్డి, రాందాస్‌నాక్లె, అడ్డిరుకేష్‌రెడ్డి, సింగిరెడ్డి రాంరెడ్డి, సుధాంరెడ్డి, అల్చెట్టినాగన్న, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

'త్వరలోనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు'

ఆదిలాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): త్వరలోనే జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో టీయూడబ్ల్యుజే ఐజేయూ యూనియన్ డైరీని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటికే జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. జిల్లా కేంద్రంలో పలుచోట్ల ప్రభుత్వ భూమిని గుర్తించి జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇందులో యూనియన్ జిల్లా కన్వీనర్ టి.దేవిదాస్, కో కన్వీనర్ ఎం.రాజేశ్వర్ తదితరులున్నారు.

సర్వీస్ రోడ్డు కోసం అఖిలపక్ష సమావేశం

నిర్మల్ రూరల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విశ్రాంతి భవనంలో సోన్ మండలం కడ్తాల్ గ్రామస్తులు మా సర్వీస్ రోడ్డు మాకు కావాలని అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. 44 జాతీయరహదారి విస్తరణలో భాగంగా గ్రామంలో ఫ్లైఓవర్ నిర్మించారని దీంతో సర్వీస్ రోడ్డు లేకుండారహదారి నిర్మించారని తెలిపారు. న్యాయ నిపుణుల సూచన మేరకు భవిష్యత్తులో మా సమస్య పరిష్కారం కాకుంటే సుప్రీం కోర్టుకు వెళ్తామని తెలిపారు. వారం రోజుల్లో పరిష్కారం చేయకుంటే మండలంలోని అన్ని గ్రామాలను కలుపుకొని భారీ బహిరంగ సభ నిర్వహిస్తూ ఎన్‌హెచ్ 44 రోడ్డును అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇందులో అల్లూరి మల్లారెడ్డి, నూతన్ కుమార్, రామ్‌లక్ష్మణ్, రాజు, కృష్ణవేణి, ఎంసీ లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

తలమడుగు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనాన్ని కొత్త మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని మండల ప్రత్యేక అధికారి గజానంద్ కోరారు. శుక్రవారం ఆయన పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి వివరణ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ప్రజా ప్రభుత్వంలో అక్రమాలకు తావులేదు

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్



ఉట్నూర్ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): కుల మతాలకు అతీతంగా గరిబోళ్లకే పెద్దపీట వేస్తూ ప్రజా ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని అక్రమాలకు తావు ఇవ్వబోమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. శుక్రవారం ఉట్నూర్, లక్కారంలో జరిగిన ప్రజాపాలన గ్రామసభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న ప్రభుత్వాలు తప్పులు చేశామని వేలు ఎత్తి చూపడం కంటే తాము అలాంటి తప్పులు చేయబోమని అన్నారు. మానవత దృక్పథంతో అర్హులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందిస్తామని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభలకు జీవం పోశారని గ్రామసభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనర్హులు ఎవరైనా ఉంటే తప్పకుండా ప్రతీఒక్కరు గ్రామసభ దృష్టికి తెచ్చి పేదవాడికి న్యాయం జరిగేలా కృషి చేయాలన్నారు. అధికారులను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆత్మీయ భరోసా, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డులు అర్హులైన ప్రతి ఒక్కరికి వస్తాయన్నారు. ప్రస్తుతం జాబితాలలో పేర్లు ఉన్నంత మాత్రాన ఎవరో చెప్పే మాటలకు అపోహాలకు గురికాకుండా వేచి చూడాలన్నారు. పన్నుల రూపంలో ప్రజలు ప్రభుత్వానికి చెల్లించిన డబ్బులే అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఖర్చు చేయడం జరుగుతుందని, అలాంటి నిధులను అక్రమార్కులకు ఎలా ఇస్తామని అన్నారు. ఉట్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలో 62 మందిని రైతు భరోసా నుంచి తొలగించామన్నారు. ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు వస్తుందని, రాని వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఖానాపూర్ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ గృహాలు మంజూరు అవుతాయని, అదే కాకుండా ముఖ్యమంత్రి ద్వారా ఐటీడీఏ పరిధిలో మరిన్ని ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కానున్నాయని అన్నారు. ఈ సమావేశంలో భరత్‌చౌహాన్, బొంత ఆశారెడ్డి, మండల ప్రత్యేక అధికారి సుధాకర్, ఎంపీడీవో రాంప్రసాద్, తహసీల్దార్ ప్రవీన్‌కుమార్, పంచాయతీ ప్రత్యేక అధికారి ప్రభాకర్, కార్యదర్శి శంకర్, ఈజీఎస్ ఏపీఓ రజనికాంత్, ఏఎంసీ వైస్ చైర్మన్ జైవంతురావు, డీసీసీబీ డైరెక్టర్ ఎస్పీ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అలాగే, ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ చేతుల మీదుగా టీఎస్‌టీడబ్ల్యుటీయూ,జిల్లా నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌లను శుక్రవారం ఆవిష్కరించుకున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు.

● ఖానాపూర్ పట్టణ అభివృద్ధి కృషి చేస్తా

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం అధ్యక్షతన నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద నూతన లేబర్ కార్యాలయం నిర్మాణం, డబుల్ బెడ్ రూమ్ కాలనీ ప్రజలకు తాగునీటి సౌకర్యం అందించేందుకు నూతనంగా బోరు మోటార్లను ఏర్పాటు చేస్తామని పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం ఖానాపూర్ మున్సిపల్‌కు మంజూరైన రెండు తడి చెత్త, పొడి చెత్త వాహనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దొని కెని దయానంద్, వైస్ చైర్మన్ కావలి సంతోష్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నిమ్మల రమేష్, మండల ప్రధాన కార్యదర్శి షబ్బీర్ పాషా, కౌన్సిలర్లు కోఆప్షన్ సభ్యులు , మున్సిపల్ కమిషనర్ మనోహర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జన్నారపు శంకర్, అమానుల్లా ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు బాలలతో పోటీ పడి రాణించాలి

● లక్ష్మణచాంద తహసీల్దార్ జానకి



బాబాపూర్‌లో మాట్లాడుతున్న లక్ష్మణచాంద తహసీల్దార్ జానకి

లక్ష్మణచాంద, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బాలికలు బాలలతో పోటీపడి రాణించాలని తహసీల్దార్ జానకి అన్నారు. వరల్డ్ విజన్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాబాపూర్ గ్రామంలో నిర్వహించిన జాతీయ బాలల దినోత్సవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడలు, వ్యాపారం, రాజకీయం తదితర అన్ని రంగాల్లో రాణించి ఉత్తమ ప్రతిభ కనబరిచి మహిళా శక్తిని ఈ ప్రపంచానికి చాటి చెప్పాలన్నారు. అలాగే వడ్యాల్, పీచర గ్రామాల్లో కూడా జాతీయ బాలికా దినోత్సవంలో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఇందులో స్వచ్ఛంద సేవా సంస్థ కోఆర్డినేటర్‌లు హనుమన్న, కరుణ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ జున్ను అనిల్, తదితరులున్నారు.

● ఆడపిల్లలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

తలమడుగు: ప్రతి ఆడపిల్ల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బరంపూర్ క్లస్టర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రత్యూష కోరారు. శుక్రవారం జిల్లా మహిళా సాధికారత కేంద్రం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఆదిలాబాద్ వారి ఆధ్వర్యంలో బరంపూర్ జిల్లా పరిషత్ ఉన్నత సెకండరీ పాఠశాల,లో జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి బేటీ బచావో, బేటీ పడావో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పాఠశాలలో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ ప్రత్యూష భారత దేశంలో ఆడపిల్లలు ఎదుర్కొంటున్న విద్య, పోషకాహారం, చట్టపరమైన హక్కులు, రక్షణ, గౌరవం వంటి సమస్యలపై అవగాహన కల్పించారు. యశోద, జిల్లా మహిళా సాధికారత కేంద్రం డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రతీయేడు జనవరి 24న జాతీయ బాలిక దినోత్సవం నిర్వహిస్తారన్నారు. ఇందులో సఖి కేంద్రం సిబ్బంది, సంఘమిత్ర, డీహెచ్‌ఈడబ్ల్యూ సిబ్బంది కోటేశ్వర, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆడ పిల్లలను పుట్టనిద్దాం వారికి భద్రతనిద్దాం

ఆదిలాబాద్ రూరల్: ఆడ పిల్లలను పుట్టనిద్దాం.. వారికి భద్రతనిద్దాం.. స్వేచ్ఛ జీవితాన్ని అందిద్దామని సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి అన్నారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని మహాలక్ష్మీవాడ ప్రభుత్వ పాఠశాలలో షుర్ ఎన్‌జీఓ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి, డీసీపీవో రాజేంద్ర ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ చైర్మన్ వెంకటస్వామి మాట్లాడుతూ ఆడ పిల్ల భారం కాదని దేవుడిచ్చిన వరమన్నారు.

అర్హులైన ప్రతీఒక్కరికి సంక్షేమ పథకాలు

సిరికొండ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీవో ఎం.రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని సోన్‌పెల్లి, ధర్మాసాగర్, వాయిపేట్, కుంటగూడ తదితర గ్రామాల్లో ఆయా గ్రామాల ప్రత్యేకాధికారులు గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సోన్‌పెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎంపీడీవో రవీందర్ మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హులను గుర్తించేందుకు, అనర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చూసేందుకు నిర్వహిస్తున్న గ్రామసభలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగపర్చుకోవాలని కోరారు. రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, తదితర పథకాల కోసం అర్హత కలిగిన వారు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ జాదవ్ ఉపేందర్, ఎంపీవో సంతోష్, పంచాయతీ కార్యదర్శులు అరుణ్‌కుమార్, జైపాల్, జీవన్, శ్రీనివాస్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేరడిగొండ: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని బుగ్గారం, చిన్న బుగ్గారం, కొర్టికల్ (కె), కొర్టికల్(బి) నాగమల్యాల్, పీచర్, రోల్‌మామడ, వడూర్, యాపల్‌గూడ గ్రామాల్లో ప్రజా పాలన గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి పేర్లను చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారు మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. అనంతరం దరఖాస్తులను స్వీకరించారు. కాగా అక్కడక్కడ అర్హులైన వారి పేర్లు జాబితాలో లేవని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. వారికి సర్ది చెప్పి మళ్ళీ దరఖాస్తులను స్వీకరించారు. ఈ గ్రామసభల్లో ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, ఎంఈవో భూమారెడ్డి, ఆయా గ్రామాల పంచాయితీ కార్యదర్శులు, ఉపాధిహామీ టీఏలు, ఎఫ్ఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

కుభీర్: ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు సంక్షేమ పథకాలు అర్హులైన లబ్ధిదారులందరికి వర్తింప జేస్తామని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపికయిన లబ్ధిదారుల పేర్లు చదివి వినిపించారు. కాగా రేషన్‌కార్డులు, రైతు ఆత్మీయ భరోసా పేర్లను చదివి వినిపించగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు 600ల మంది పేర్లను సూచిక బోర్డుపై అతికించారని, అందులో నుంచి ఎందరికి ఇండ్లు మంజూరు అవుతాయని గ్రామస్తులు అధికారులను ప్రశ్నించారు. రేషన్‌కార్డులు, రైతుఆత్మీయ భరోసా పేర్ల మాదిరిగానే కాకుండా ఇందిరమ్మ ఇండ్ల మంజూరిలో అవకతవకలు జరిగాయని 600 మంది పేర్లలో ఎవరికి వస్తాయని ప్రశ్నించారు. కాగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు పథకాలు అమలు నిరంత ప్రక్రియ అని అర్హులైన లబ్ధిదారులకు పథకాలు వర్తించక పోతే తమ దరకాస్తులను వారం రోజుల పాటు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో మోహన్‌సింగ్, డీటీ అశోక్‌కుమార్, ఏపీవో హరిలాల్, ఆయా శాఖల అధికారులు, నాయకులు ఏశాల దత్తాత్రి, కనకయ్య, జావిద్‌ఖాన్, సంతోష్, పండరి, ఎన్నిల నాగేందర్, రాంబోల్ శేఖర్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

● నేటితో ప్రజా పాలన గ్రామసభలు పూర్తి

బజార్‌హత్నూర్: మండలం పరిదిలోని మాన్కపూర్, బూతాయి బి, మోర్ఖండి, దిగ్నూర్, వర్తమన్నూర్ గ్రామ పంచాయతీల పరిదిలో శుక్రవారం గ్రామసభలు ప్రశాంతంగ ముగిసాయి. రేషన్‌కార్డుల, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ళు, లబ్దిదారుల జాబితాలను అధికారులు గ్రామ సభలో చదివి వినిపించారు. అర్హులైన లబ్దిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి మొహ్మద్ సౌద్, వెంకటేశ్వర్లు, ఆరై నూర్ సింగ్, ఏఈఓ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి తేజస్విని, శ్రీకాంత్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పలుచోట్ల గ్రామసభల్లో గందరగోళం



తలమడుగులో అధికారులను నిలదీస్తున్న లబ్దిదారులు, నాయకులు

తలమడుగు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ అభివృద్ధి పథకాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సభలు గందరగోళంగా మారాయి. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల ప్రత్యేక అధికారి గజానంద్, ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభలో గందరగోళం నెలకొంది. పథకాలు మంజూరైన లబ్ధిదారుల జాబితా చదువుతుండగా జాబితాలో అర్హులైన లబ్ధిదారులకు ఆత్మీయ భరోసా, డబుల్ బెడ్ రూమ్‌లు, రేషన్ కార్డులు మంజూరు కాలేదని అధికారులను మండల బీసీ సంఘం అధ్యక్షుడు మేకల రవికాంత్ యాదవ్, ఆసం రవి, మంతెన శ్రీకాంత్ అంబేద్కర్ సంఘం నాయకులు ఎలుగు ఆనంద్‌లు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి దరఖాస్తులు చేసుకున్నప్పటికీ లబ్ధిదారులకు. ఎందుకు రాలేదన్నారు. అదే విధంగా అధికారులు ప్రతి ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి. ఇంటి యజమాలతో ఫోటోలు తీసినప్పటికీ అర్హత జాబితాలో పేర్లు రాలేదని అధికారులను నిలదీశారు. అదేవిధంగా గ్రామసభలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఫోటో ఎందుకు పెట్టలేదన్నారు. కేవలం ఆదివాసి ఎమ్మెల్యే అయినందునే చిన్న చూపుతోనే ఫోటో పెట్టలేదని మేకల రవికాంత్ యాదవ్ అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి మాట్లాడుతూ జాబితాలో పేరులేని లబ్ధిదారులు గ్రామసభలో మండల కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎవరు ఆందోళన చెందవద్దని, లబ్ధిదారులకు నచ్చ చెప్పారు. అనంతరం లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు.

● సర్వేలో అన్నీ తప్పులే..

తాంసి: కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలు అద్యాంతం ఆందోళనకరంగా ముగిసాయి. ఈనెల 21 నుంచి తాంసి మండలంలో నిర్వహించిన గ్రామసభలో అనేక మంది ప్రజలు అధికారులు నిలదీశారు. ఇందిరమ్మ ఇళ్లపై చేసిన సర్వే తప్పుల తడకగా ఉంది అంటూ మండిపడ్డారు. అద్దెకు లేకున్నా అద్దెకు ఉననటుల జాబితాలో నమోదు చేయడం ఏ మేరకు సమంజసమని విడదీశారు. గ్రామసభలకు వచ్చిన అధికారులకు సమస్యలను విన్నవిస్తే పట్టించుకోకపోవడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నిస్తున్నారు. సాక్షాత్తు తాంసి మండల కేంద్రంలో సైతం ఇలాంటి సంఘటన చోటు చేసుకుంది. గురువారం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పలువురు ప్రజలు అధికారులను నిలదీశారు.

● ఫ్లెక్సీపై ఎమ్మెల్యే ఫొటో లేదని ఆందోళన

బోథ్: మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన ప్రజా పాలన కార్యక్రమం కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్ వివాదాల మధ్య కొనసాగింది. ఫ్లెక్సీ పైన ఎమ్మెల్యే ఫోటో ఎందుకు పెట్టలేదని ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య వివాదానికి దారి తీసింది. ఒక దశలో వివాదాన్ని ఆపేందుకు బోథ్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ప్రవీణ్ కుమార్ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అయితే కొంతమంది మహిళలు తాము అర్హులమైన రేషన్ కార్డులు ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదని అధికారులను నిలదీశారు. అయితే కాంగ్రెస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకొని మా ప్రభుత్వం పేదల కోసం ఉందని వారి సంక్షేమం కోసం రేషన్ కార్డులు ఇళ్లు మంజూరి చేయించడం జరుగుతుందని పేర్కొన్నారు. గత పదేళ్ల నుంచి పాలకులు పట్టించుకోలేదని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఒక దశలో మహిళలు అధికారులతో తీవ్ర వాగ్వావాదం చేస్తే మహిళా పోలీసులు జోక్యం కల్పించుకోవాల్సి వచ్చింది.

సాగు లేని భూముల లెక్క తేలింది!

(5వ పేజీ తరువాయి...)

పట్టా ఆధారంగా రైతుబంధు సొమ్మును అందించారు. కానీ ప్రస్తుతం పంటలు సాగు చేస్తున్న, సాగుకు అనుకూలమైన భూములకు మాత్రమే రైతుభరోసా కింద పెట్టుబడి సహాయాన్ని అందించనున్నారు.

ఎకరాన రూ.12 వేలే..

ఎన్నికల సమయంలో ఎకరాన రూ.15వేలను పెట్టుబడి సహాయం కింద అందిస్తామని ప్రభుత్వం చెప్పినా.. అది సాధ్యంకాక పోవడంతో ఎకరాన రూ.12వేలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇకపై రైతుభరోసా కింద రెండు విడతలుగా రూ.12వేలు చెల్లించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఈనెల 26 నుంచి రైతుభరోసా పథకాన్ని అమలు చేయనున్నారు. అర్హులైన రైతులు మళ్లీ రైతుభరోసా పథకానికి దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే అవకాశం కల్పిస్తున్నారు. ముఖ్యంగా బ్యాంకు అకౌంట్ మార్పు లు, జనవరి 1వరకు కొత్త పట్టాదారు పాస్‌పుస్తకాలకు రైతుభరోసాను అందించనున్నారు. గరిష్ట, కనిష్ట పరిమితిని విధించక పోవడంతో సాగు కు యోగ్యమైన భూములన్నింటికీ రైతుభరోసా కింద పెట్టుబడి సహాయం అందనుంది.

సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాం

: శ్రీధర్‌స్వామి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, ఆదిలాబాద్



ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలో సాగుకు యోగ్యంకాని భూములను గుర్తించాం. వాటి వివరాలను ప్రభు త్వ ప్రత్యేక పోర్టల్‌లో నమోదు చేయడం జరిగింది. పంటలు సాగు చేస్తున్న రైతులకు మాత్రమే పెట్టుబడి సహాయం అందేవిధంగా చర్యలు చేపడుతు న్నాం. రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకునే విషయంలో పూర్తిస్థాయిలో స్పష్టత లేదు. ప్రభుత్వ ఆదేశాలు అందగానే విధి విధానాలను ప్రకటిస్తాం. ఏమైనా అభ్యంతరాలు ఉంటే గ్రామసభలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా సమస్యలను పరిష్కరిస్తాం.

ఆదిలాబాద్ జిల్లాలో ప్రజాపాలన గ్రామ సభల్లో వచ్చిన మొత్తం దరఖాస్తుల వివరాలిలా..

ఇందిరమ్మ ఇళ్ల కోసం	: 16730
రేషన్ కార్డుల కోసం	: 32727
ఆత్మీయ భరోసా కోసం	: 13666
రైతు భరోసా కోసం	: 387

'దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి'

నిర్మల్ అర్బన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం గ్రామసభలు నిర్వహిస్తుండగా ఉపాధి హామీ సిబ్బంది లబ్ధిదారుల పేర్లను చదివే సమయంలో అకారణంగా దాడి చేసిన వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని శుక్రవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఆర్డీవో విజయలక్ష్మిలకు జిల్లా ఉపాధి హామీ సిబ్బంది యూనియన్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని ఇచ్చారు. సోన్ మండలం సాకెర గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా గ్రామసభలో ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, నర్సాపూర్ మండలం టెంబుర్ని గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్‌లపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి వారి పైన చర్యలు తీసుకోవాలని కోరారు.

'షేర్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి'

నర్సాపూర్(జి), జనవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రైతులను మభ్యపెట్టి భూములు కొనుగోలు చేసిన పంజాబ్ షేర్స్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని రైతులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... కదిలి, మాడేగాం, కుస్లి, దర్యాపూర్, రాంపూర్, కంకెట, ప్యారమూర్, దొనెల్లి గ్రామాల్లో పంజాబ్ షేర్స్ కంపెనీ యాజమాన్యం పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని రైతులకు మాయ మాటలు చెప్పి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసిందని తెలిపారు. ఇప్పటి వరకు ఎలాంటి పరిశ్రమలు నిర్మించలేదని వాపోయారు. వెంటనే సదరు కంపెనీపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రఘురాం పటేల్ తెలంగాణ స్టేట్ కాంగ్రెస్ కిసాన్ జనరల్ సెక్రటరీ, దత్తు, లక్ష్మారెడ్డి, పోతారెడ్డి, జీవన్ రావు, బొప్పారం సాయన్న, నారాయణ, శంకర్, ఉత్తం, సీతారాంపటేల్, ప్రవీణ్, సుధాకర్, మహిపాల్, రమేష్, గంగాధర్ జాడే ఎస్సీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు, మోహన్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది స్మగ్లర్ల పట్టివేత

భైంసా, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణ శివారు ప్రాంతంలోని మిషన్ భగీరథ పథకం సమీపంలో గల ఒక పశువుల పాకలో అక్రమంగా రవాణీ చేసేందుకు నిర్బంధి ఉంచిన అడవీ పందులను భైంసా ఎఫ్ఆర్‌వో వేణుగోపాల్ నేతృత్వంలోని అటవీశాఖాధికారుల బృందం పట్టుకుంది. గురువారం రాత్రి పక్క సమాచారం మేరకు అటవీశాఖాధికారులు సంబంధిత పశువుల పాకపై ఆకస్మికంగా దాడి చేసి అక్కడ బంధించి ఉన్న ఏడు అడవీ పందులను స్వాధీనం చేసుకొని వాటిని నిర్బంధించి అక్రమ రవాణా చేపడుతున్న 8మంది స్మగ్లర్లను పట్టుకొని అరెస్టు చేశారు. పట్టుబడిన స్మగ్లర్లలో మహారాష్ట్రలోని హిమాయత్‌నగర్ ప్రాంతానికి చెందిన గైక్వాడ్ గంగాధర్‌తో పాటు భైంసా పట్టణానికి చెందిన చెర్ల మహేష్, ఈరేవార్ సోను, చెర్ల గణేష్, రాసూర్ గోవింద్, దహగామ్ గ్రామానికి చెందిన కోనేరు పోశెట్టి, కోనేరు గజేందర్, కోనేరు ఈశ్వర్, తదితరులు ఉన్నారు.

అధికారుల విందు వివాదం!!

● సాంగిడి గ్రామంలో అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

ఆదిలాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు సంక్షేమ పథకాల అమలుకు గ్రామసభలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగానే శుక్రవారం బేల మండలంలోని సాంగిడి గ్రామంలో అధికారులు గ్రామసభను నిర్వహించారు. అనంతరం ఓ స్థానిక నాయకుడు ఇచ్చిన విందు దావతుకు అధికారులు హాజరు కావడం వివాదాస్పదంగా మారింది. సాంగిడి గ్రామంలోని ఓ పంట చేనులో అధికారులంతా కలిసి మందు విందుతో దావతు చేసుకుంటుండగా కాంగ్రెస్ నాయకులు అడ్డుకోవడం వివాదానికి దారి తీసింది. ప్రస్తుతం అధికారులు దావతు చేసుకుంటున్న ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తున్నాయి. ఓ ప్రతిపక్ష నాయకుడికి అనుకూలంగా వ్యవహరించడానికే మండల ప్రత్యేక అధికారితో పాటు మండల స్థాయి అధికారులు ఈ దావతుకు హాజరయ్యారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు.ఇదేమిటని అడుగగా అధికారులు అక్కడి నుంచి చడిచప్పుడుకాకుండా జారుకున్నారు. దీని పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు కాంగ్రెస్ నాయకులు సిద్ధమవుతున్నారు.

మెస్రం వంశీయుల ప్రత్యేక పూజలు

● సంప్రదాయ వాయిద్యాల నడుమ గంగాజలంతో ఇంద్రాయి ఆలయానికి మెస్రం వంశీయులు
● ఎడ్లబండ్లపై మర్రిచెట్టు వద్దకు చేరిన మెస్రం వంశీయులు


ఇంద్రాయి ఆలయ చెట్టుపై గంగాజలాన్ని కడుతున్న మెస్రం వంశం అల్లుడు


ఇంద్రాయి దేవతకు పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా పేరు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకొని ఈ నెల 28న నాగోబా ఆలయంలో నిర్వహించే మహాపూజకు అవసరమగు గంగాజలం సేకరించిన మెస్రం వంశీయులు శుక్రవారం సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ మండల కేంద్రంలోని ఇంద్రాయి ఆలయానికి చేరుకున్నారు. ఆలయ ప్రాంగణంలో మెస్రం వంశం అల్లుడు గంగాజలాన్ని చెట్టుపై తెల్లని వస్త్రంతో కట్టి భద్రపరిచారు. సంప్రదాయం ప్రకారం ఇంద్రాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నైవేద్యాలు తయారు చేసి ఇంద్రాయికి సమర్పించారు. గంగాజలంతో ఇంద్రాయి ఆలయానికి మెస్రం వంశీయులు చేరిన విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల మెస్రం వంశీయులు ఎడ్లబండ్లతో ఇంద్రాయి ఆలయా నికి చేరుకుని పూజలు చేసి కుటుంబ సమేతంగా ఇం ద్రాయి ఆలయ ఆవరణలో సాయంత్రం వరకు బస చేశారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వేళ్ల ఇంద్రాయి దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడి నుంచి సంప్రదాయ వాయిద్యాల నడుమ గంగాజలంతో కాలినడకన, మరికొందరు కుటుంబ సమేతంగా ఎడ్లబండ్లపై కేస్లాపూర్‌కు బయల్దేరారు. శుక్రవారం రాత్రి కేస్లాపూర్ మర్రిచెట్లకు చేరుకున్న మెస్రం వంశీయులు అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. కాగా మెస్రం వంశీయులు మర్రిచెట్లు ప్రాంతంలోని గంగాజలంను మోదుగ చెట్టుపై తెల్లని వస్త్రంతో కట్టి భద్రపరిచారు. ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకొని కుటుంబ సమేతంగా బస చేశారు. శనివారం రాత్రి మెస్రం వంశీయుల పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావుతో పాటు మెస్రం వంశీయుల పటేళ్లు మర్రిచెట్ల వద్దకు చేరుకొని ఈనెల 28న నాగోబాకు నిర్వహించే మహాపూజలతో పాటు తూమ్ పూజల నిర్వహణపై చర్చించనున్నట్లు మెస్రం వంశీయుల పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కటోడ మెస్రం దేవ్‌రావు, కటోడ మెస్రం కోసురావు, పర్ధాంజీ మెస్రం దాదారావ్, మెస్రం తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


భక్తి
ఇంద్రాయి ఆలయానికి వస్తున్న మెస్రం వంశీయులు


ఇంద్రాయి ఆలయం వద్ద మొక్కుతున్న మెస్రం వంశీయులు

పెరిగిన మొక్కజొన్న సాగు విస్తీర్ణం

● ఆశాజనకంగా పంట


కృషి
మొక్కజొన్న సాగు దృశ్యం

తాంసి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. గతంతో పోలిస్తే మూడింతలు ఈ పంట సాగు విస్తీర్ణం పెరిగిందని చెప్పవచ్చు. తాంసి మండలంతో పాటు జిల్లా నలు మూలల సుమారు 13 వేల ఎకరాల్లో ఈ పంట సాగవుతున్నట్లు తెలిసింది. ఈ పాటికే విత్తనాలు నాటి 35 నుంచి 40 రోజులు కావస్తుంది. మరి కొంత మంది రైతులు ఈ పంట సాగు చేసేందు కోసం ముందడుగు వేస్తున్నారు. తాంసి మండలంలో జామిడి, కపర్ల, వడ్డాది, బండల నాగపూర్, హసనాపూర్ గ్రామాలలో ఈ పంటను ఎక్కువగా సాగు చేస్తున్నారు.

● సీడు మొక్కజొన్నపై ఆసక్తి

మండలంలో ఎక్కువగా సీడ్ కోసం మొక్క జొన్న సాగును చేసేందుకు కోసం రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా ఈ పంటను జామిడి గ్రామానికి చెందిన 36 మంది రైతులు సుమారు 300 ఎకరాలలో సాగు చేస్తున్నారు. మొక్కజొన్నకు మార్కెట్‌లో గిట్టుబాటు కూడా బాగానే ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. గిట్టు బాటుతో పాటు దిగుబడులు కూడా అన్నింటికంటే ఎక్కువగా వస్తున్నాయని పేర్కొంటున్నారు. గత మూడు సంవత్సరాలుగా సీడ్ మొక్కజొన్నను సాగు చేస్తున్నట్లు ఆ గ్రామ రైతులు పేర్కొన్నారు.

● ఆశించిన స్థాయిలో దిగుబడులు

మొక్కజొన్న పంట ఆశించిన స్థాయిలో దిగుబడులు రావడంతో కూడా చాలా మంది రైతులు ఈ పంట సాగు చేసేందు కోసం ముందుకు వస్తున్నారని చెప్పవచ్చు. ఎకరానికి 35 నుంచి 40 క్వింటాళ్ళ వరకు దిగుబడి వస్తుందని అంటున్నారు. ఈ పంట సాగుకు ఖర్చు కూడా అంతంత మాత్రమేనని వివరించారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర క్వింటాల్‌కు 1300 నుంచి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ లెక్కన మంచి దిగుబడులతో పాటు గిట్టుబాట ధర లభిస్తుండటంతో గతం కంటే ఈ సంవత్సరం మొక్కజొన్న సాగుపై రైతులు ఎక్కువగా శ్రద్ధ చూపుతున్నారు.

● మార్కెట్ సౌకర్యం ఉంటే మరింత పెరిగే అవకాశం

జిల్లా కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు మార్కెట్ సౌకర్యం కనుక కల్పిస్తే ఈ పంట సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. కొనుగోలు కేంద్రం లేక ప్రైవేట్ దళారులకు అమ్ముకోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. దీంతో తాము కొంత నష్టపోవాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం శ్రద్ధ చూపి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని మొక్కజొన్న సాగు రైతులు కోరుతున్నారు.


చివరి దశలోనున్న శనగ పంట


అయ్యో..రైతన్న!
పంట చేలకు వెళ్లకుండా వేసిన ముళ్ల కంప

శనగ పంట చోరీలతో రైతన్నల కుదేలు

● దిగుబడులను కాపాడుకునేందుకు పంటచేల వద్ద కాపలా ● చలిలో మంటలు కాగుతూ రక్షణ చర్యలు

భైంసా, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఏదో ఒక వైపరీత్యం అన్నదాతలను నిర్వేదానికి గురి చేస్తోంది. పుడమి తల్లిని నమ్ముకొని సేద్యం చేస్తూ అభివృద్ధి బాటలోకి పయనిద్దామనుకుంటున్న రైతన్నలకు అగచాట్లు తప్పడం లేదు. సాధారణంగా ప్రకృతి వైపరీత్యాలు, నకిలీ విత్తనాలు, అతి వృష్టి, అనావృష్టి తదితర కారణాలతో అన్నదాతలు కష్ట, నష్టాల పాలవుతుంటారు. సరైన రీతిలో దిగుబడులు రాక, ఆశించిన ధరలు లేక పెట్టుబడుల సైతం చేతిక అందక ఆర్థికపరమైన సమస్యలు ఎదుర్కొంటుంటారు. కానీ ప్రస్తుత యాసంగి సీజన్‌లో మాత్రం ఇందుకు విరుద్ధమైన రీతిలో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. చివరి దశకు చేరుకొని చేతికి వస్తున్న శనగ పంట చోరీకి గురవుతుండటంతో రైతన్న కుదేలవుతున్నారు. ఆశించిన మేర దిగుబడులు వస్తున్న తరుణంలో పంట చేలలోకి చోరులు వెళ్లి శనగ పైరు తెంపుకొని దొంగతనానికి పాల్పడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా భైంసా పార్డీ (బి) బైపాస్ రోడ్డు మార్గంతో పాటు భైంసా- బాసర, భైంసా- బెలతరోడా-తానూర్ రోడ్డు మార్గాల్లో శనగ పంట చోరీ అధికంగా జరుగుతోంది. ప్రధానంగా రోడ్డును అనుకొని ఉన్న పంటచేలలో చోరీలు అధికంగా జరుగుతున్నాయి. చోరులు శనగ పైర్లను తెంపుకెళ్లి మార్కెట్లలో విక్రయిస్తున్నట్లుగా తెలిసింది. ఇంకొందరు ఇళ్లలో కాల్చుకొని తీనేందుకు వాటిని తెంపుకొని తీసుకవెలుతున్నట్లుగా సమాచారం. ఒక వైపు చోరులు, మరోవైపు శనగ బుడ్లలు కాల్చుకొని తీనేవారు పంట చేల నుంచి పైర్లను తెంపుకెలుతుండటంతో వాటి నియంత్రణకు రైతన్నలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే ప్రధాన రోడ్డు మార్గాల్లో పంట చేలు ఉన్న రైతులు వంతుల వారీగా శనగ పంటను చోరీల నుంచి కాపాడుకునేందుకు కాపాలా కాస్తున్నారు. ఉదయం. సాయంత్రం వేళలో జన సంచారం లేని సమయంలో చోరీలు జరుగుతుండటాన్ని గుర్తించిన రైతన్న అదే సమయాల్లో పంట చేల వద్ద రక్షణ చర్యలు చేపడుతున్నారు. చలి బెడద నుంచి ఉపశమనం పొందేందుకు గాను మంటలు కాగుతూ పంటచేల వద్ద కాపలా కాస్తున్నారు. ఇంకొంత మంది రైతులు పంటచేలలోకి చోరబాట్లు జరుకుండా ఉండేందుకు గాను చుట్టూ ముళ్ల కంపలను కంచెలాగా వేస్తున్నారు.శనగ పంట చోరీలతో రైతన్నలు అగచాట్ల పాలవుతున్నారు.


చలి మంటలు కాచుకుంటూ
పంట చేల వద్ద కాపలా కాస్తున్న రైతులు

పశువుల్లో అంతుపట్టని రోగం

● వారం రోజుల్లో 30 గేదెల మృతి
● లబోదిబో మంటున్న రైతులు

సోన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా పశు వుల్లో వస్తున్న అంతుచిక్కని రో గాలతో పాడి రైతులు ఆందోళన కు గురవుతున్నారు. మండలం లోని పలు గ్రామాల్లో కేవలం వారం రోజుల్లోనే 30 వరకు గేదెలు మృత్యువాత పడడంతో రైతులు లబోదిబో మంటున్నారు. తాజాగా గురువారం సోన్ మండల కేంద్రంలోని కంతి శ్రీనివాస్‌కు చెందిన గేదె కూడా అకస్మాత్తుగా మరణిం చడంతో దాదాపు 70 వేల వరకు నష్టపోయినట్లు సదరు రైతు వాపోతున్నారు. ఈ విషయమై ఇన్‌చార్జి పశు వైద్యాధికారి ఓం ప్రకాష్ గుప్తాను వివరణ కోరగా సోన్ గోదావరి పరివాహక ప్రాంతంలో పశువుల దాహార్తి తీర్చుకున్న తర్వాత పాయిజన్ లక్షణాలు కనిపిస్తున్నాయని తెలిపారు. లక్షణాలను బట్టి చికిత్సలను అందిస్తున్నామన్నారు. అంతేకాకుండా పాడి రైతులు తమ గేదెలకు ఇళ్ల వద్దనే శుభ్రమైన తాగునీటిని అందించాలని సూచించారు.


సోన్‌కు చెందిన శ్రీనివాస్ గేదె
వింత వ్యాధితో మృతి చెందిన దృశ్యం


ఐటీడీఏ ముందు ఏర్పాటు చేసిన నర్సరీ స్టాల్





ఇంటికి అందాలు.. అలంకరణ మొక్కలు

ఉట్నూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) ఇంటికి ముగ్గు ఎంత అందమో, అలంకరణ మొక్కలు కూడా అంతే అందమని ప్రతిఒక్కరూ భావిస్తున్నారు. ప్రజల ఆసక్తిని గుర్తించిన ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పండ్ల తోటలో ఉద్యానవన అధికారులు ప్రజల కోసం ఉద్యానవన నర్సరీని అందుబాటులోకి తెచ్చారు. జిల్లా కలెక్టర్ రాజార్శి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మార్మాట్‌ల చేతుల మీదుగా ఇటీవల ఐటీడీఏ కార్యాలయం ముం దు నర్సరీ స్టాల్‌ను ప్రారంభించారు. రూ.20 మొద లుకొని రూ.200 విలువ ఉన్న మొక్కలను ప్రజల కోసం అందు బాటులోకి తెచ్చారు. కొత్తగా ఇల్లు నిర్మించుకుంటున్న వారు, ఇప్పటికే ఇండ్లు కట్టుకున్న వారు కూడా ఇళ్ల ముందు గులాబీ లాంటి అందమైన పూల మొక్కలతో పాటు వివిధ రకాల పూలమొక్కలు, అలంకరణ మొక్కలు, పండ్ల మొక్కలు అందుబాటులో ఉంచారు. ఉట్నూర్ నుంచి మంచి ర్యాల వెళ్లే రోడ్డుపైన ఈ స్టాల్ ఉండడంతో ద్విచక్ర వాహనాలు, కార్లలో వెళ్లేవారు ఇక్కడ కాసేపు ఆగి మొక్కలు కొనుగోలు చేసున్నారని ఐటీడీఏ ప్రాజెక్టు హార్టికల్చర్ ఆఫీసర్ సందీప్ కుమార్ తెలిపారు.



ఫొటో న్యూస్


స్టాల్‌లో పెట్టిన మొక్కలు



విరబూసిన మామిడి

● మామిడి రైతులకు మంచి రోజులు


నిండా పూత ఉన్న మామిడి చెట్టు

తాంసి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గతంతో పోలిస్తే ఈ సంవత్సరం మామిడి రైతులకు మంచి రోజులు వచ్చినట్లే కనిపిస్తున్నాయి. మామిడి చెట్లకు చెట్టు నిండా పూత రావడంతో ఇక తమ పంట పడినట్టేనని మామిడి చెట్ల పెంపకం దారులు అంటున్నారు. పూతకు కావాల్సిన రీతిలో ఈ సంవత్సరం వాతావరణ పరిస్థితులు ఉండటంతో ఎలాగైనా ఈ సంవత్సరం తమ కష్టాలు తీరుతాయని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తాంసి మండలంతో పాటు జిల్లా వ్యాప్తంగా సుమారు రెండు వందల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ప్రస్తుతం మామిడి చెట్లను చూస్తే పూతతో నిండుగా కనిపిస్తున్నాయి. కొన్ని చెట్లకు చిన్న చిన్న పిందెలు కూడా వచ్చాయి. గత సంవత్సరం కిలో మామిడికాయలు 60 నుంచి 80 రూపాయలు పలుకగా ఈ సంవత్సరం మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని పెంపకందారులు అంటున్నారు. అలాగే మామిడి పండ్ల విషయానికి వస్తే కిలో రూపాయలు 120 నుంచి 150 వరకు కూడా పలికింది. తమను పత్తి పంట ఆదుకోకపోయినా కనీసం మామిడితోనైనా తమ కష్టాలు తీరుతాయని ఆశాభావంలో మామిడి రైతులు ఉన్నారు.






బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ!

- ప్రస్తుత పార్టీ అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డితో పాటు సీనియర్ నేతల ఆసక్తి
- పోటీలో సామ రాజేశ్వర్ రెడ్డి, రవి పాండే, హరి నాయక్, రితేష్ రాథోడ్‌లు
- కసరత్తు మొదలుపెట్టిన పార్టీ అధిష్ఠానం
- వయస్సు నిబంధన అమలైతే మార్పు తప్పనిసరి!





నిర్మల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్ష పదవిపై ఉత్కంఠ మొదలైంది. జిల్లాలో మూడు నియోజకవర్గాలకు గానూ రెండు నియోజకవర్గాల్లో బీజేపీ ఎమ్మెల్యేలు గెలుపొందిన నేపథ్యంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్ష పదవి ప్రస్తుతం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇప్పటికే బీజేపీ బూత్‌స్థాయి నుంచి మండల స్థాయి వరకు కమిటీల నియామకాలను పూర్తి చేసింది. ఇక జిల్లా అధ్యక్ష పదవి నియామకమే మిగలడంతో ఆ పార్టీ ఈ దిశగా కసరత్తు చేస్తోంది. అయితే ఈ సారి నుంచి జిల్లా అధ్యక్ష పదవి కోసం 60సంవత్సరాల వయస్సులోపు వారికే అవకాశం కల్పించనున్నట్లు జరుగుతున్న ప్రచారంతో పోటీ రసవత్తరంగా మారే అవకాశాలున్నాయి. అయితే ప్రస్తుతం జిల్లా అధ్యక్ష పదవిని మరోసారి అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డి ఆశిస్తుండగా.. ఆయనతో పాటు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, ఖానాపూర్‌కు చెందిన రితేష్ రాథోడ్, హరి నాయక్, ముథోల్‌కు చెందిన రవిపాండేలు పోటీలో ఉన్నారు. ఒకవేళ ఆ పార్టీ అధిష్ఠానం 60 సంవత్సరాల వయస్సును పరిగణలోకి తీసుకోనట్లయితే తిరిగి అంజు కుమార్ రెడ్డినే అధ్యక్ష పదవి వరించే అవకాశాలున్నాయంటున్నారు. లేనట్లయితే సామ రాజేశ్వర్ రెడ్డి, రితేష్ రాథోడ్, హరినాయక్, రవి పాండేలు పోటీలో నిలవబోతున్నారు. ఇదిలా ఉండగా నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌లు మాత్రం ఈ సారి ఎస్టీకే జిల్లా అధ్యక్ష పదవిని కట్టబెడితే రాజకీయంగా పార్టీకి మరింత కృషి చేసే అవకాశాలుంటాయని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

అయితే కొద్ది రోజుల్లోనే స్థానిక ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలు జరగబోనున్న నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవి కీలకంగా మారే అవకాశాలున్నట్లు ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఈ సారి ఎలాగైనా మెజార్టీ గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లతో పాటు మున్సిపల్ చైర్మన్ పదవులను అలాగే జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని దక్కించుకోవాలన్న ఉద్దేశంతో బీజేపీ రాజకీయంగా పావులు కదుపుతోంది. జిల్లాపై పూర్తిస్థాయిలో ఆధిపత్యం కొనసాగించేందు కోసం స్థానిక ఎన్నికల్లో పైచేయి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంటోంది. మొన్నటి అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి గణనీయమైన ఓట్లు రావడంతో ఆ పార్టీ స్థానిక ఎన్నికలపై ఆశలు రెట్టింపు చేసుకుంటోంది. కేవలం నిర్మల్ నియోజకవర్గంలోనే బీజేపీ 50వేల ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించగా ముథోల్ నియోజకవర్గంలో 29వేలకు పైగా ఓట్ల మెజార్టీని దక్కించుకుంది. ఇదే పొలిటికల్ ట్రెండ్‌ను కొనసాగించాలని ఆ పార్టీ యోచిస్తోంది. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో జిల్లా అధ్యక్ష పదవికి బలమైన అభ్యర్థిని ప్రతిపాదించి అటు కాంగ్రెస్, ఇటు బీఆర్ఎస్‌కు చెక్ పెట్టాలని కమలం పార్టీ ముమ్మరంగా కసరత్తు చేస్తోంది.

తిరిగి బరిలో అంజు కుమార్ రెడ్డి

ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు అంజు కుమార్ రెడ్డిని అధిష్ఠానం ఆదేశిస్తే ఆ పదవిని మరోసారి చేపట్టేందుకు ఆసక్తి చూపనున్నారు. అంజు కుమార్ రెడ్డి పార్టీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి తన రాజకీయ చాణక్యంతో పాటు న్యాయ పరమైన అంశాలను తెరపైకి తెచ్చి జిల్లాలో బీజేపీని బలీయమైన రాజకీయ శక్తిగా మార్చడంలో కీలక పాత్ర పోషించారు. అంజు కుమార్ రెడ్డి భైంసా సంఘటన సందర్భంలో పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచి వారి తరఫున న్యాయ పోరాటాలు చేశారు. అలాగే నిర్మల్‌లో అప్పటి బీఆర్ఎస్ నేతల భూకబ్జాలు, చెరువుల ఆక్రమణలు, వారి అవినీతి అక్రమాలపై హైకోర్టును ఆశ్రయించి దుమారం రేపారు. అలాగే నిరంతరం కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వారికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. పార్టీ అధిష్ఠానంతో కూడా ఆయనకు మంచి సంబంధాలున్నట్లు చెబుతున్నారు. జిల్లాలోని ఇతర సీనియర్ నాయకులు, కార్యకర్తలు సైతం అంజుకుమార్ రెడ్డిని మరోసారి అధ్యక్ష పదవి కోసం బలపరుస్తుండడం కూడా ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. పార్టీ నియమావళికి కట్టుబడి ఉండే అంజు కుమార్ రెడ్డి మాత్రం అధిష్ఠానం ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తానంటూ చెబుతున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేల ప్రతిపాదనలే కీలకం

కాగా.. అంజుకుమార్ రెడ్డితో పాటు అధ్యక్ష పదవిని ఆశిస్తున్న సామ రాజేశ్వర్ రెడ్డి, రితేష్ రాథోడ్, హరి నాయక్, రవి పాండేలు కూడా తమ వంతు ప్రయత్నం ముమ్మరం చేస్తున్నారు. అయితే ఆ పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు మహేశ్వర్ రెడ్డి, రామారావు పటేల్‌లు మాత్రం ఈ సారి జిల్లా అధ్యక్ష పదవిని ఎస్టీ నేతకు అప్పగించాలని సూచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే రితేష్ రాథోడ్, హరి నాయక్‌ల పేర్లు తెరపైకి వచ్చే అవకాశాలున్నాయి. పార్టీ అధిష్ఠానం రాబోయే స్థానిక ఎన్నికలను అలాగే భవిష్యత్‌లో పార్టీని మరింత బలోపేతం చేయాలన్న అంశాన్ని పరిగణనలోకి తీసుకునే అవకాశాలున్నాయని అంటున్నారు. ఇదే జరిగితే తిరిగి అంజు కుమార్ రెడ్డికి ప్రాధాన్యం దక్కవచ్చని, లేనట్లయితే ఎమ్మెల్యేల ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకున్నట్లయితే రితేష్ రాథోడ్, హరి నాయక్‌ల్లో ఎవరికో ఒకరికి అధ్యక్ష పదవికి దక్కవచ్చని విశ్వసనీయ సమాచారం.

బాలికలు ఉన్నత స్థాయికి ఎదగాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్ అర్బన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలు జీవితంలో ఉన్నత స్థితిలో నిలిచేందుకు చిన్నతనం నుంచే ఉన్నత బాటలు వేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాంనగర్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్‌కు విద్యార్థులు బ్యాండు మేళాతో ఘన స్వాగతం పలికారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అధికారులతో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జాతీయ బాలికా దినోత్సవం ప్రతి సంవత్సరం జనవరి 24న జరుపుకుంటామని, ఈ ప్రత్యేకమైన రోజు సమాజానికి బాలికల పాత్ర ఎంత ముఖ్యమైందో గుర్తు చేసుకుందని తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు కలెక్టర్, అదనపు కలెక్టర్లు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం ఏర్పాటు చేసిన సెల్ఫీ కేంద్రం వద్ద ఫోటోలు దిగారు. అధికారులు, విద్యార్థులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. విద్యార్థులంతా బాధ్యతగా నాటిన మొక్కలను సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో డీఈవో పి. రామారావు, డీటీడీవో అంబాజీ, మెప్మా పీడీ సుభాష్, నిర్మల్ పట్టణ ఎంఈవో నాగేశ్వర్ రావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుకారాం, మిషన్ శక్తి సమన్వయకర్త సవిత, సీడబ్ల్యూసీ చైర్మన్ వాహిద్, సీడీపీవో, ఇతర అధికారులు, ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కవులు, కళాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్

నిర్మల్ ఉత్సవాల విజయవంతంలో సాంస్కృతి ప్రదర్శనలు ముఖ్య పాత్ర పోషించాయని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ సమావేశ మందిరంలో నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో సాంస్కృతిక ప్రదర్శనల్లో భాగస్వామ్యమైన కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నిర్మల్ ఉత్సవాలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న అందరినీ కలెక్టర్ అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, డీఈవో రామారావులతో పాటు కలిసి ప్రశంసా పత్రాలను ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నిర్మల్ ఉత్సవాల కార్యక్రమంలో కవులు, కళాకారులు, విద్యార్థులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీవో విజయలక్ష్మి, కార్యాలయ పర్యవేక్షకులు సూర్యారావు, కవులు, కళాకారులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, డ్యాన్స్ మాస్టర్లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రాన్ని వినియోగించుకోవాలి

- ఎమ్మెల్యే పవార్ రామరావు పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కుబీర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని మండల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పాటిల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామరావుపాటిల్ మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంట దిగుబడులను దళారులకు విక్రయించి మోసపోకుండా రైతుల కోసం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. క్వింటాలుకు రూ.7,550 అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కంది పంట సాగుచేసిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ శాఖ ఏఈవోలతో ధ్రువీకరణ పత్రంతో పాటు పట్టాపాసుపుస్తకం, బ్యాంకు అకౌంట్ జిరాక్సులను అందించి టోకెన్లను పొందాలన్నారు. ఎకరానికి మూడు క్వింటాళ్లు కాకుండా ఆరు క్వింటాళ్ల వరకు కొనుగోలు చేయాలని పీఏసీఎస్ చైర్మన్, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ గంగాచరణ్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో భైంసా ఏఎంసీ చైర్మన్ ఆనంద్‌రావుపాటిల్, నాయకులు వడ్నం నాగేశ్వర్, బోయిడి విఠల్, మోహన్, ఏశాల దత్తాత్రి, కమలేష్, పీఏసీఎస్ సీఈవో క్రాంతి కుమార్, ఏఎంసీ కార్యదర్శి గంగాధర్, రైతులు, నాయకులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- భైంసా జూనియర్ సివిల్ న్యాయాధికారి


పోటీలను ప్రారంభిస్తున్న న్యాయాధికారి

భైంసా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదులకు వృత్తిపరంగా ఎదురయ్యే ఒత్తిడిల నుంచి క్రీడలు ఉపశమనంతో పాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని భైంసా జూనియర్ సివిల్ న్యాయాధికారి దేవేంద్రబాబు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా శుక్రవారం భైంసా బార్ అసోసియేషన్ నిర్వహిస్తున్న క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. క్రీడల ద్వారా మైత్రి బంధాలు మెరుగవుతాయన్నారు. ప్రతి నిత్యం వృత్తిపరంగా నెలకొనె ఒత్తిడిలు దూరమవడమే కాకుండా ఉత్సాహంగా పనిచేసేందుకు క్రీడలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. నిత్యం క్రమం తప్పకుండా క్రీడలతో పాటు యోగా, వ్యాయామం లాంటి వాటి సాధన చేస్తే పరిపూర్ణ ఆరోగ్యంతులుగా ఉండవచ్చునని తెలిపారు. మానసిక ప్రశాంతత సైతం చేకూరి ఏకాగ్రతతో వృత్తిపరమైన విధులను చేపట్టేందుకు అస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా భైంసా జూనియర్ సివిల్ న్యాయాధికారి దేవేంద్రబాబు న్యాయవాదులతో క్యారమ్ ఆట ఆడి ఉత్సాహపరిచారు. ఇందులో భైంసా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సి.శంకర్, ప్రధాన కార్యదర్శి కుంట కీర్తి, క్రీడా కార్యదర్శి తాడేవార్ సాయినాథ్‌తోపాటు బార్ అసోసియేషన్ శ్రేణులు, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తీర్ణతే లక్ష్యంగా కృషి చేయాలి


ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహిస్తున్న డీఈవో

భైంసా, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పదిపరీక్షల ఫలితాల్లో ఉత్తీర్ణతయే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రామరావ్ సూచించారు. శుక్రవారం భైంసా పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించి పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. సబ్జక్టుల వారీగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో పదో తరగతి విద్యార్థులకు బోధించే ఉపాధ్యాయులు విధులను అంకితబావంతో నిర్వర్తిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తు కోసం బాధ్యతాయుతంగా పాటుపడాలని పేర్కొన్నారు. ప్రత్యేక తరగతులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. చదువులో వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వారు ఉత్తీర్ణులయ్యేలా తర్ఫీదునివ్వాలన్నారు. ప్రణాళికబద్దంగా పునశ్చరణ తరగతులను నిర్వహిస్తూ ఉత్తమ ఫలితాలు సాధించేలా పాటుపడాలని సూచించారు.

నాణ్యమైన విద్య అందించాలి

ముథోల్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా విద్యాధికారి రామారావు అన్నారు. ముథోల్ మండలంలోని విట్టోలి ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని పథకాలు, సదుపాయాలు తప్పకుండా అందించాలని తెలియజేశారు. విద్యార్థులకు అందిస్తున్న రాగిజావను స్వయంగా పరిశీలించారు. మధ్యాహ్న భోజన సిబ్బందితో మాట్లాడి విద్యార్థులకు తాజా సరుకులతో నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలోని మూత్రశాలలు, మరుగుదొడ్లు పరిశీలించి ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులలో పఠన నైపుణ్యాలు, ప్రగతిని పరిశీలించారు.

డీఈవో ఆకస్మిక తనిఖీ

భైంసా రూరల్ : మండలంలోని వానల్‌పాడ్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను శుక్రవారం డీఈవో రామారావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 10వ తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రత్యేకతరగతిని పరిశీలించి, 10వ తరగతి విద్యార్థులకు ఇంగ్లీష్ సబ్జెక్టులో పలు ప్రశ్నలు అడిగి సమాధానం రాబట్టారు. విద్యార్థులు సమాధానం చెప్పడంతో డీఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. వార్షిక పరీక్షల సంసిద్ధత గురించి విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతి విద్యార్థి ఉదయం 5 గంటలకు నిద్ర లేవాలని, పాఠశాల తర్వాత ఇంటి దగ్గర రాత్రి 10 గంటల వరకు చదవాలని సూచించారు. ప్రతి విద్యార్థి సబ్జెక్టుల వారీగా ప్రణాళికను తయారు చేసుకొని చదవాలని తెలిపారు. విద్యార్థుల హాజరు శాతాన్ని, పాఠశాల పరిసరాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులు సలహాలు, సూచనలు ఇచ్చారు. ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థులను ఉదయం 5 గంటల లోపు వేకప్ కాల్ చేయాలని, రాత్రి వేళల్లో ఉపాధ్యా యులు విద్యార్థుల ఇళ్లను సందర్శించాలని తెలిపారు. ప్రతి విద్యార్థి పదవ తరగతిలో పాస్‌అయ్యే విధంగా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

గ్రామ సభల్లో నిరసనలు.. సర్దిచెప్పిన అధికారులు


దిలావర్‌పూర్ మండలం గుండంపల్లి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

దిలావర్‌పూర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : దిలావర్ పూర్, గుండంపల్లి గ్రామ సభల్లో ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. గ్రామస్తుల ఆందోళనలతో అధికారులు గ్రామసభలను అర్థాంతరంగా ముగించి వెళ్లిపోయారు. మండలంలోని సముందర్‌పల్లి, గుండంపల్లి, దిలావర్‌పూర్ గ్రామాల్లో నాలుగు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై గ్రామసభలు నిర్వహించారు. సముందర్‌పల్లి మినహా గుండంపల్లి, దిలావర్ పూర్‌లలో గ్రామసభలు అర్థాంతరంగా ముగిశాయి. గ్రామసభల్లో అధికారులు సంక్షేమ పథకాలకు ఎంపికైన లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. ఏ ప్రాతిపదికన లబ్ధిదారులను ఎంపిక చేశారని ప్రశ్నించారు. ఇప్పటి వరకు చేసిన సర్వేలన్నీ బూటకమేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్హులై ఉండి జాబితాలో పేరులేని వారు తిరిగి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు కోరగా ఎన్నిసార్లు దరఖాస్తులు చేసుకోవాలని, గతంలో చేసు కున్న దరఖాస్తులు ఎటుపోయాయని మండిపడ్డారు. ఆయా గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఎంపీడీవో అరుణరాణి, ఎంపీవో గోవర్ధన్, ఎంఈవో కే.శంకర్, మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, ఎంపీ ఎన్ఆర్ ఈజీఎస్ ఏపీవో దివ్య రెడ్డి పాల్గొన్నారు.

ముథోల్ : మండలంలోని చించాల, ఆష్ట, వెంకటాపూర్, వడ్తాల్ గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలపై గ్రామసభలు నిర్వహించారు. అధికారులు గ్రామసభలు నిర్వహించి అర్హులైన జాబితాను వినిపించడంతో ముఖ్యంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల లిస్టులపై గ్రామస్తులు తమ పేరు రాలేదని అధికారులను ప్రశ్నించారు. అర్హులైన వారి పేర్లు ఎందుకు రాలేదని నిలదీశారు. దీంతో అధికారులు ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేశామని ఎలాంటి ఆందోళన చెందవద్దని వారు సూచిం చారు. అయితే చించాల గ్రామంలో అధికా రులు జాబితాను చదువుతుండగా గ్రామస్తులు కొందరు ఒకరికొకరు వాగ్వాదం చేసుకొని తోపులాటకు దారి తీసింది. దీంతో కొంచెం గందరగోళ పరిస్థితి ఏర్పడ్డది. పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని తోపులాట చేసుకున్న వారిని సముదాయించారు. కార్యక్ర మంలో డీఈవో రామారావు, శ్రీకాంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఆర్ఐ నారాయణ పటేల్, రెవెన్యూ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ స్తులు, తదితరులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి) : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఇళ్లు ఉన్నవారికి ఇళ్లు వచ్చాయని అధికారులను గ్రామస్తులు నిలదీశారు. ఇందిరమ్మ ఆత్మీయభరోసాలో గంద రగోళం నెలకొంది. లిస్టులో లేకపోవడంతో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీవో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. లిస్టులో పేర్లు రాని వాళ్లు మళ్లీ అప్లై చేసుకో వాలన్నారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన సుదర్శన్ గౌడ్ ముంపునకు గురైన నర్సాపూర్(జీ) గ్రామానికి ప్రత్యేకంగా ఇళ్లను మంజూరు చేయాలని దరఖాస్తు అందించినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో తిరు పతి రెడ్డి, సెక్రటరీ కైలాస్, ఉపాధి హామీ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి రామచందర్ నాయక్, నాయ కులు పాల్గొన్నారు.


చించాలలో గ్రామసభలో తోపులాట

లోకేశ్వరం : లోకేశ్వరం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా పుష్పూర్, లోకేశ్వరం గ్రామాల్లో ప్రజల ఆం దోళనలు మిన్నంటాయి. గ్రామ సభలో ప్రజలు అధికారులపై అసంతృప్తి వ్యక్తపరి చారు. అర్హులైన పేదలను కాదని అనర్హులను ఎంపిక చేశారంటూ నిలదీశారు.

భైంసా: మున్సిపల్ కేంద్రమైన భైంసాలోని 10 వ వార్డు పరిధిలో గల ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన వార్డు సభ రసాభాసగా కొనసాగింది. సంక్షేమ పథకాల అర్హుల జాబితాలపై వార్డువాసులు ఆందోళనలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్ కుమార్, అధికారులతో తీవ్రస్థాయిలో వాగ్వాదానికి దిగారు. ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ అధికార బృందాన్ని హడలెత్తించారు. మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్ నేతృత్వంలో అధికారుల బృందాన్ని నిలదీశారు. చివరకు మున్సిపల్ కమిషనర్ రాజేష్‌కుమార్ ఆందోళనకారులను సముదాయించి వార్డు సభ నిర్వహింపచేశారు.

లక్ష్మణచాంద: అర్హులందరికీ తప్పకుండా పథకాలు వర్తింపజేస్తామని ఎంపీడీవో రాధారాథోడ్ శుక్రవారం హామీ ఇచ్చారు. మండలంలోని పొట్టపెల్లి(కె), చంద్రపూర్‌లలో జరిగిన గ్రామ సభలలో ఆమె పాల్గొని గ్రామసభకు హాజరైన వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఎవరు కూడా దళారుల మాటలు నమ్మవద్దని, ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దన్నారు. స్థానిక పంచాయతీ కార్యదర్శికి గాని మండలాభివృద్ధి కార్యాలయంలో గాని సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తులు స్వీకరించటం అనేది నిరంత ప్రక్రియ అని స్పష్టం చేశారు. ఆయా గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితాలో తమ పేర్లు లేవని స్థానికులు అధికారుల ముందు వాపోయారు. గ్రామ సభలలో ఎంపీడీవో రాధా రాథోడ్, ఎస్సై సుమలత, డిప్యూటీ తహసీల్దార్ అజీజ్, ఎంపీవో అమీర్ ఖాన్, ఏఈఈలు పుష్పలతాయి. అంజనేశ్వర్‌లతో పాటు స్థానిక మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న నర్సాపూర్ గ్రామస్తులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

కుంటాల, జనవరి, 24 : (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలన్నీ అర్హులకు అందిస్తామని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం కుంటాలతో పాటు ఆయా గ్రామాలలో గ్రామసభలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇది వరకు మంజూరు చేసిన ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, నూతన రేషన్‌కార్డులు లబ్దిదారుల జాబి తాను చదివి వినిపించారు. ప్రస్తుతం జాబితాలో పేర్లు రాని అర్హులైన లబ్దిదారులు ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ప్రతి పథకం నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులైన లబ్దిదారులు దరఖాస్తు చేసు కుంటే అమలు చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎజాజ్‌అహ్మద్ ఖాన్, ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం, ఏపీవో నవీన్, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.


కుంటాల గ్రామసభలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్